
# కాంగ్రెస్‌లో చేరిన పాలడుగు చేనేత సంఘం అధ్యక్షుడు



## నూతన పాలకవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాలడుగు చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన పసునూరి ప్రభాకర్ ఆ గ్రామ సర్పంచ్ అంతటి భగవంతు ఆధ్వర్యంలో మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటి వరకు సీపీఎంలో కొనసాగిన ఆయన ఇటీవల జరిగిన చేనేత సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్నిక కాగా ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే సామేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ వారిని సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ బాలరాజు, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు ముశం స్వామి, సెక్రటరీ ముశం సత్యనారాయణ, డైరెక్టర్లు జెల్ల సులోచన, గుండు కళావతి, మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, మాజీ సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు జెల్ల నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎంతో ప్రభాకర్‌కు సంబంధం లేదు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాలడుగు గ్రామ చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన పసునూరు ప్రభాకర్‌కు సీపీఎంతో ఎలాంటి సంబంధం లేదని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలడుగు గ్రామం నుంచి ప్రభాకర్ సుమారు 20 ఏళ్ల క్రితమే వలిగొండకు వలస వెళ్లారని, నాటి నుంచే ఆయనకు సీపీఎంతో ఎలాంటి సంబంధం లేదని, ఆయనకు పార్టీ సభ్యత్వం కూడా లేదని, పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని తెలిపారు. ఆయన సీపీఎం అని చెప్పుకుంటున్న తప్పుడు వార్తలను ఖండిస్తున్నామన్నారు.




# యువతపై లాఠీఛార్జి ప్రజాస్వామ్యంపై దాడి

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

ఢిల్లీ జంతర్ మంతర్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యువత, విద్యార్థులపై జరిపిన లాఠీచార్జి ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల్లో అవినీతి, నీట్ పరీక్షా పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వరకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులను, యువతను అడ్డుకొని బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పరీక్షల్లో జరుగుతున్న అవినీతి, ప్రశ్నపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య ఆయన వెంట ఉన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజావారధి/మోత్కూరు



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం మోత్కూరు మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మయాదయ్యల కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వలిగొండ-తొర్రూర్ రోడ్డు హైవే నర్సాపురం స్టేజీ వద్దకు రావాలని కోరారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు.